క్లుప్తంగా

నిడమనూరు ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారిగా వెంకన్న

నిడమనూరు : నిడమనూరు ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారిగా వెంకన్న నియామకమయ్యారు. గతంలో పనిచేసిన ఏఓ మునికృష్ణయ్య యూరియా పంపిణీలో అక్రమాలు, రైతుల ఆందోళనపై సకాలంలో స్పందించలేదన్న ఆరోపణలపై ఏఓ మూడు నెలల పాటు సస్పెండ్ అయ్యారు. కాగా.. కొత్తగా నియామకమైన వెంకన్న డిండి పరిశోధన స్థానంలో వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఆర్టీఏ కార్యాలయ ఏర్పాటుకు గాను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి స్థల పరిశీలన చేశారు.

నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

కొండమల్లేపల్లి(చింతపల్లి): చింతపల్లి మండల పరిధిలోని గడియగౌరారం గ్రామపంచాయతీలో వన నర్సరీని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెరుగుదలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఉపాధి హామీ పనులపై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీఓ శౌరిరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటయ్య, ధర్మా, సుమీర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కష్టాలు తీర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్: యూరియా కష్టాలను తీర్చి రైతులను ఆదుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి రవి నాయక్ మాట్లాడుతూ.. రైతులకు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమయానికి యూరియా వేయకపోవడంతో వరి దిగుబడి తగ్గి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం నాయకులు మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, చౌగాని సీతారాములు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ సభ్యుడు సురేందర్‌కు సన్మానం



సురేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడకు వచ్చిన బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్‌ను బుధవారం స్థానిక ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో సత్కరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సురేందర్‌ను కోరారు. ఆయన వెంట రాజు, కృష్ణ, నరేందర్, రామయ్య, యాదగిరి తదితరులున్నారు.

జయంతి ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్‌గా సత్యనారాయణ

నల్లగొండ: చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా కొండూరు సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న ఐలమ్మ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుందని తెలిపారు.

యూరియా తిప్పలు



యూరియా కోసం వ్యవసాయ మార్కెట్ వద్ద బారులుదీరిన రైతులు

- నిడమనూరు సహకార సంఘానికి తక్కువగా కేటాయిస్తున్న యూరియా
- ఇబ్బందులు పడుతున్న రైతులు

నిడమనూరు : నిడమనూరు సహకార సంఘానికి యూరియా కేటాయింపులు తక్కువగా ఉండటంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడపాదడపా కేటాయింపులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం నిడమనూరు సహకార సంఘానికి 20 టన్నులు రాగా, 30 టన్నులు ప్రైవేటు వారికి యూరియా వచ్చింది. వెనిగండ్ల సహకార సంఘానికి రాలేదు. యూరియా పంపిణీపై స్పష్టమైన ప్రకటన లేకపోవడం కూడా రైతుల్లో తీవ్ర గందరగోళానికి దారి తీస్తోంది. ప్రైవేటు ఎరువుల దుకాణాదారులకు మంగళవారం సాయంత్రం యూరియా రాగా బుధవారం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ప్రైవేట్ వారు రాత్రికి రాత్రే యూరియా పంపిణీ పూర్తి చేస్తున్నారు. ఉదయం అధికారులు రాగానే కొంత పంపిణీ చేశామంటూ ధృవీకరిస్తున్నారు. కాగా.. నిడమనూరు మండలంలో రైతులు 36 వేల ఎకరాల్లో వరి, 1937 ఎకరాల్లో పత్తి సాగుచేస్తున్నారు. వరి, పత్తి అవసరాలకు 38 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని వ్యవసాయాధికారుల ప్రాథమిక అంచనా. ఇప్పటి వరకు నిడమనూరు సహకార సంఘం ద్వారా 1280 మెట్రిక్ టన్నులు, వెనిగండ్ల సహకార సంఘం ద్వారా 340 మెట్రిక్ టన్నులు, మండలంలోని 14 ఎరువుల దుకాణాల్లో 850 టన్నులు, మొత్తంగా 2470 టన్నులు యూరియా విక్రయించినట్లు అధికారులు చెబుతున్నారు.

కూపన్ కోసం గంటల కొద్దీ క్యూలైన్‌లో..

నిడమనూరు సహకార సంఘంలో యూరియా దొరకాలంటే ఒక రోజు మార్కెట్ యార్డులో కూపన్ కోసం క్యూలైనులో ఉండాల్సి వస్తోంది. అనంతరం కూపన్ ఆధారంగా వేలిముద్ర, నగదు చెల్లింపు రశీదు పొందాలి. ఆ తర్వాత కిలోమీటరు దూరంలోని సహకార గోదాం వద్ద యూరియా పొందాలి. రెండు బస్తాల యూరియాకోసం రెండు రోజులు రైతులు పడిగాపులు పడాల్సి వస్తోంది. యూరియా రాకోపోతే మూడు రోజులకు రెండు యూరియా బస్తాలు లభిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తెల్లవారుజామున క్యూలైనులో బారులుదీరితే.. అధికారలు 9-10 గంటలకు వచ్చి యూరియా కూపన్లు, రశీదులు, పంపిణీ చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికై నా నిడమనూరు, వెనిగండ్ల సహకార సంఘాలకు అధిక కేటాయింపులు చేయాని రైతులు కోరుతున్నారు.

యూరియా విక్రయాలపై సరైన ప్రకటన ఉండడం లేదు



యూరియా విక్రయాలపై అధికారులు సరైన ప్రకటన చేయడం లేదు. దీంతో ప్రతిరోజు సహకార సంఘానికి వచ్చి వెళ్లాల్సి వస్తోంది. ఒకటి, రెండు, మూడు రోజులకోసారి నిడమనూరు సంఘానికి యూరియా వస్తోంది. రైతుకు రెండు బస్తాల యూరియా పంపిణీ చేస్తుండటంతో పలు పర్యాయాలు రావాల్సి వస్తోంది. యూరియా పంపిణీపై అధికారులు ఎప్పటికప్పుడు సరైన ప్రకటన చేయాలి.

– ఎర్రగూడెం రాంబాబు

రైతులు ఒక్కసారిగా రావడంతో..

దేవరకొండ : యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చందంపేట మండలంలోని పోలేపల్లి ఆగ్రోస్ కార్యాలయం వద్ద బుధవారం యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. యూరియా లోడ్ వస్తున్న సమాచారంతో రైతులు ఒక్కసారిగా అక్కడకు చేరుకున్నారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని రైతులకు క్యూలైన్ ఏర్పాటు చేసి యూరియా బస్తాలను అందించారు. యూరియా బస్తాలు అందని రైతులు నిరాశతో వెనుతిరగగా వారికి వచ్చే స్టాక్‌లో యూరియా అందిస్తామని అధికారులు పేర్కొన్నారు.

రహదారులు గుంతలమయం



తుమ్మచెట్టు తండా నుంచి పర్వేదులకు వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

పెద్దవూర: మండలంలోని పలు రహదారులు గుంతలమయంగా మారాయి. తుమ్మచెట్టు తండా స్టేజీ వద్ద నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారి వెంట రోడ్డుకు ఇరువైపులా పెద్ద గుంతలు పడి వర్షం నీరు నిల్వ ఉంటుంది. పర్వేదుల, చలకుర్తి వెళ్లే రోడ్డుపై మోకాళ్ల లోతులో గుంతలు పడి నెలలు గడుస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు. పెద్దగూడెం, కొత్తలూరు గ్రామాలలో సైతం రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. రోడ్లపై ఉన్న గుంతలకు రెండువైపులా దుకాణాలు, ఇళ్లు సైతం ఉండటంతో వాహనాలు వెళ్లే సమయంలో నీరంతా దుకాణాల్లోకి వస్తోందని వాపోతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతలను పూడ్చి వేయాలని కోరుతున్నారు.



పులిచర్లలోని ప్రధాన రహదారిలో..



పెద్దగూడెంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు

ఆహార అలవాట్ల మార్పుతో పోషకాహార లోప నివారణ

- ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్

మిర్యాలగూడ: ఆహారపు అలవాట్ల మార్పుతోనే పోషకాహార లోప నివారణ సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. జాతీయ పోషకాహార మాసోత్సవం సందర్భంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సమాచార సంస్థ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో నిర్వహించిన ఛాయా చిత్ర ప్రదర్శన, అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటి బాలికలు, చిన్నారుల్లో పోషణ లోపం ఉండడం బాధాకరమన్నారు. రక్తహీనత నిర్మూలన, విటమిన్లు, సమృద్ధిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడంపై, కౌమార బాలికలు, గర్భిణులు, బాలింతలపై అధికారులు మరింత దృష్టి పెట్టాలన్నారు. జిల్లా సంక్షేమశాఖ అధికారిణి కృష్ణవేణి మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి అక్టోబర్ 16వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోషన్ బీ పడాయి బీ పథకం అంగన్‌వాడీ కేంద్రాలను పోషకాహారం, విద్య అందించే సమీకృత హబ్‌లుగా మారుస్తుందన్నారు. అనంతరం మహిళలకు బతుకమ్మ, వంటల పోటీలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ మమత, సీబీసీ సహాయ సంచాలకులు కోటేశ్వర్‌రావు, వైద్యాధికారి సంజయ్‌కుమార్, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు.



ఛాయా చిత్ర ప్రదర్శన, అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్

సతీష్‌కు నివాళి

వేములపల్లి: మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ప్రమాదవశాత్తు కాల్వలో గల్లంతై బొల్లెద్దు సతీష్ మృతిచెందాడు. అతడి మృతదేహాన్ని బుధవారం ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీపీసీసీ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, పుట్టల కృపయ్య, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పల్లా అశోక్, వినోద్, చలబొట్ల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసేందుకు ప్రభుత్వాల కుట్ర

- సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి



మాట్లాడుతున్న తుమ్మలపల్లి వీరారెడ్డి

నాగార్జునసాగర్: రీజినల్ రింగ్ రోడ్డు పేరిట ప్రభుత్వాలు రైతులను మరోసారి మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని, బాధిత రైతులు ప్రతిఘటనకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మలపల్లి వీరారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నాగార్జునసాగర్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఇచ్చే నష్టపరిహారం మార్కెట్ రేటు ప్రకారం కాకుండా భూమి రిజిస్ట్రేషన్ రేటు ప్రకారం చెల్లిస్తామనడం రైతులకు ద్రోహం చేయడమేనన్నారు. ఈనెల 26వ తేదీ వరకు పర్యటించి, రైతులను సమీకరించి వారికి భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బాధిత రైతులంతా కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ లక్ష్మీనారాయణ, సీపీఎం జిల్లా నాయకుడు ఎస్‌కే బషీర్ తదితరులున్నారు.

బీసీ రిజర్వేషన్లపై నివేదిక పారదర్శకంగా ఉండాలి

మిర్యాలగూడ టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల విషయంపై అధికారులు ప్రభుత్వానికి అందించే నివేదిక పారదర్శకంగా ఉండాలని బీసీ యువజన సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్ అన్నారు. బుధవారం మిర్యాలగూడలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల అమలుపై వివరించాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై అన్ని రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో మద్దతు ఉండాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలగాని వెంకటేష్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్కా నాగేశ్వర్‌రావుయాదవ్, గంగాధర్, మురళి, నరేష్, వెంకన్న, జలందర్, శ్రీను, అంజి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

డిండి: దేవరకొండ పట్టణంలో అక్టోబర్ 26, 27వ తేదీల్లో నిర్వహించే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య కోరారు. బుధవారం డిండి మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.

సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

మిర్యాలగూడ టౌన్: విద్యార్థులు సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధాన చార్యులు మలిగిరెడ్డి భీమార్జున్‌రెడ్డి అన్నారు. బుధవారం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్–1, 2 ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు జాతీయ సేవలో పాల్గొని, సామాజిక అవసరాలను తెలుసుకొని వాటికి అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాస్‌రావు, స్వప్న, నాగరాజు, అరుందతి, కవిత, సాయినాథ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులున్నారు.



మిర్యాలగూడ టౌన్: మాట్లాడుతున్న భీమార్జున్

విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి

నాగార్జునసాగర్: విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవాపథకం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని చెడు పనులకు వినియోగించవద్దన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ చింతపల్లి వెంకటయ్య, ప్రసన్నలక్ష్మి, అధ్యాపకులు సతీష్‌చంద్ర, గోపాలకృష్ణ, సైదమ్మ, ఉపేంద్రాచారి, జనార్దన్, మాధురి పాల్గొన్నారు. అదే విధంగా ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికైన ప్రిన్సిపాల్ రాజశేఖర్‌ను అధ్యాపకులు సన్మానించారు.



నాగార్జునసాగర్: ప్రిన్సిపాల్ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

జాతీయ సేవా దినోత్సవం

డిండి: మండల కేంద్రంలోని దొతినేని నరసింహారావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ సేవా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ సంతోష్‌కుమార్, కృష్ణయ్య, అధ్యాపకులు పాండురంగయ్య, ఆంజనేయులు, శ్రీరాములు, హన్మంతు, లింగస్వామి, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

సామాజిక దృక్పథం అలవర్చుకోవాలి

దేవరకొండ: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక దృక్పథం అలవర్చుకోవాలని దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి అన్నారు. బుధవారం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థి దశ నుంచే సమాజంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ మకట్‌లాల్, సురేష్, వెంకటేష్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవి

దస్సీ కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



దస్సీ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

అడవిదేవులపల్లి : మండలంలోని గోన్యతండాలో దస్సీ కుటుంబాన్ని బుధవారం మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులకు రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. దస్సీ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్, రవీంద్రనాయక్, కంచర్ల భూపతిరెడ్డి, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నలమోతు సిద్దార్థ, మాజీ ఎంపీపీ బాలాజీనాయక్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండలంలోని మాదాపురం గ్రామానికి చెందిన రమావత్ దోళి బుధవారం మృతి చెందడంతో ఆమె మృతదేహానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ నివాళులర్పించారు. అదేవిధంగా ఇటీవల కోదండాపురం గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోలే మహేందర్, అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మైనం వెంకటయ్య మృతి చెందటంతో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

నిడమనూరు : విద్యుత్ స్తంభాలకు, మినీ ట్రాన్స్‌ఫార్మర్లకు తీగ మొక్కలు అల్లుకుపోవడంతో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని గౌండ్లగూడెం వాసులు వాపోతున్నారు. సమస్యను సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నిడమనూరు మండలంలోని సోమోరిగూడెం అవాస గ్రామమైన గౌండ్లగూడెంలో 40 కుటుంబాలకు పైగా ఉన్నాయి. తరుచూ విద్యుత్ అంతరాయాలతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో దోమల బెడద, చీకటిమయం, తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో ఒకే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, దానితోపాటు, విద్యుత్ స్తంభాలకు తీగ మొక్కలు అల్లుకున్నాయని, వర్షం వచ్చినప్పుడు తరుచూ కరెంట్ ట్రిప్ అవుతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



గౌండ్లగూడెం గ్రామంలో మినీ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగ మొక్కలు

అనుమతి లేకుండా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయొద్దు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో అనుమతి లేకుండా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి యాదగిరితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయాలంటే మున్సిపల్ కమిషనర్ ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. అనధికార స్టాళ్లను ఏర్పాటు చేస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సీపీఐ జెండా ఆవిష్కరణ

నల్లగొండ టౌన్: సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండలోని రామచంద్రారెడ్డి నగర్‌లో బుధవారం సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లేపల్లి ఆదిరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కత్ర సైదిరెడ్డి, తోటి పాండరీ, మదార్, యూసుఫ్, ఆర్ ఎస్ రాములు, తన్నీరు శివ, మారమ్మ, కందిమల్ల రవీందర్ రెడ్డి, ధనలక్ష్మి, తిరుపతయ్య, అంజయ్య గౌసియా, పారిజాత, సత్తయ్య, తన్నీరు చంటి, అంజి, పోలే నరసింహ, ఈగల శ్రీకాంత్, లింగయ్య, ఎలుకల అంజి, సాలమ్మ, శ్రీను, విన్ను, కిశోర్, వెంకటమ్మ పాల్గొన్నారు.

అన్నపూర్ణదేవిగా దుర్గామాత దర్శనం



దేవరకొండ: అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొండమల్లేపల్లి: పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద..



హాలియా: వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



వేములపల్లి: లక్ష్మీదేవిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు